# ఆకలి జబ్బులు

'దండాలమ్మగోరో' అనే మాటలు విని చక చకా వార్డువైపు నడిచివెళ్తున్న సౌదామిని తిరిగి చూసింది. చూస్తూనే గతుక్కుమంది. అంతలోనే కొంచెం తేరుకొని 'ఏమి చెప్పాలా' అనుకుంటున్నంతలోనే 'తవఁరు నన్నివాల కనిపించమన్నా రమ్మగోరూ' అంది ఆ కంఠస్వరం మళ్లీ చేతులు జోడించి.

ఇరకాటంలో పడింది సౌదామిని. ఏమి చెప్పటానికి తోచక ఎదుటి వ్యక్తి ముఖంలోకి చూసింది. ఆ ముఖంలో ఎంతో బాధ కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఆరిపోబోతూ మినుకు మినుకు మంటున్న గుడ్డిదీపాల్లా కనిపిస్తున్న ఆ కళ్ళు ఎంతో ఆశగా చూస్తున్నాయి. ఆ ముఖం, దానిలో ఆ చూపులు తనను నిలిపి అడుగుతాడు. అదే స్థలం. అదే ముఖం. అవే కళ్ళు. అదే మాట. అదే దీనత్వం. ఏమి చెప్పాలి ? ఎన్నిసార్లు అబద్ధమాడాలి ? అతన్నా తను మోసగించేది ? పాపం. అతన్ని చూస్తుంటే...

ఈ ఆలోచనలతో మనసు బాగుండక వార్డు వైపు వెళ్లటం మానివేసి లైబ్రరీవైపు నడక సాగించింది సౌదామిని.

సరిగ్గా వారంరోజుల క్రితం. అదే సమయం. అదేచోటు. అదే మనిషి. అదే గొంతుక. సౌదామిని తొందర తొందరగా వార్డుకు వెళ్తోంది.

'దండాలమ్మగోరో' అంటూ చేతులు జోడించాడు.



కస్తూరి విశ్వనాధం

ఎంతో దయనీయంగా కర్కోటకుడి హృదయాన్నయినా కరిగించేలా ఉన్నాయి. సౌదామిని వంటి సున్నిత హృదయులకైతే ఇక చెప్పనక్కరలేదు.

ఎటూ తేల్చుకోలేక 'రేపు రా. నూరు అరైనా ఆరు నూరైనా తప్పకుండా చేర్పిస్తాను' అంది సౌదామిని.

ఆ ఎదుటి వ్యక్తి ముఖంలో తళుక్కున ఓ మెరుపు మెరిసింది. ఆ కళ్ళలో కృతజ్ఞతాభావం నిండిపోయింది. వినయంగా నమస్కరించాడు. సౌదామిని మళ్లీ వార్డువైపు నడక సాగించింది.

అడుగులు ముందుకు వేస్తోందేకాని సౌదామినికి మనసు మనసులో లేదు. తను అతన్ని మళ్లీ రేపు రమ్మనంది. అతను వస్తాడు. తప్పకుండా వస్తాడు.

'ఏంటి? ఏం కావాలి? దారి తొలుగు' అంది సౌదామిని. కాని అతడు తొలగలేదు.

'మీరే నన్ను రచ్చించాల!' అన్నాడతడు.

ముందే ఆలస్యమయ్యింది. ఛీఫ్ కర్కోటకుడు. మండిపడతాడు. 'సరే ఇలాంటివాళ్లు రోజుకు ఎంతోమంది' అనుకొని 'దారి వదులు. నాకవతల పనుంది' అంది.

కాని అతడుమాత్రం తొలగలేదు. ఎత్తిన చేతులు దించలేదు. సౌదామినికి విసుగు కలుగుతూంది. 'సరే రేపు కలువు' అని అలవాటు ప్రకారం అనేసి తనే ప్రక్కకు తొలిగి వెళ్లిపోయింది.

తను వెళ్తున్న తొందరలో అతడికేమి కావాలో, తనేమందో, ఎందుకందోకూడ సౌదామినికి గుర్తులేదు. తర్వాత ఆ విషయాన్నే పూర్తిగా మరిచిపోయింది.

మరుసటిరోజు వార్డు కెళ్తున్నప్పుడు మళ్లీ కనిపించాడతడు. నమస్కారంచేసి 'నన్నియాల కనిపించమన్నారు' అన్నాడు వినయంగా. సౌదామిని తొందరలో లేదేమో కొంచెం తేరిపార జూసింది. ఎముకల గూడుకు తోలు కప్పినట్లుండి, తినటానికి తిండిలేక వంచుకుపోయిన కట్టెలాంటి శరీరం. చినిగిపోయి వ్రేలాడుతున్న చొక్కా పీలికలు పీలికలై మాసి సరిగా కట్టుకోలేక మోకాళ్లపైకి ఎగదోపిన పంచ. మాసిన గడ్డం, తైలసంస్కారంలేని జుట్టు. బుగ్గలు లోపలికి పీక్కుపోయి బుడుసులు మాత్రం కనిపిస్తున్న ముఖం. అందులో అణువణువునా కొట్టొచ్చినట్లు కనిపిస్తున్న బాధ. ఎక్కడో లోతుగా గుంటల్లో కొట్టుమిట్టాడుతున్న కళ్ళు,

వాటిలో ఆరిపోయేముందు మిణుకు మిణుకు మనే దీపాల్లాంటి ఆశాకిరణాలు. ఎంతో దీనంగా దయనీయంగా కనబడుతున్నా డతడు.

సౌదామినికి అతనిపై ఎంతో జాలి కలిగింది. అతని కేమికావాలో తెలుసుకొని తన చేతనైతే సహాయం చేద్దామనుకొంది. ఆ ఉద్దేశంతోనే అడిగింది 'ఏం కావాలి?' అని.

ఇక అతడు మొదలుపెట్టాడు తన కథనంతా తను సౌదామిని వుండే హాస్టల్లో ఊడ్చే అప్పలమ్మకు దూరపు బంధువట. తనకు రెండునెలల నుంచి కడుపులో బాధట. అది భరింపరాని బాధట ఎంతమందికి చెప్పినా ఎవ్వరికి తన బాధ అర్థం కాలేదట. చివరకు కొంతమంది పెద్దాసుపత్రికి వెళ్తే ఆసుపత్రిలో చేర్చుకుంటారు పొమ్మన్నారట. ఇక్కడికి వస్తే చిన్న డాక్టరుగారు పరీక్షచేసి ముఖం అదోలా పెట్టి పెద్ద డాక్టరుగారి వద్దకు పొమ్మన్నారట. ఆయనకూడ పరీక్షచేసి నీకేమీలేదు యింటికి పొమ్మన్నారట. 'డాట్టరు బాబూ! నాబాద మీ కరతంగాదు నన్ను మీ ఆసపత్తిర్లో సేర్చుకోండి' అని ప్రాధేయపడ్డాడట కాని ఆయన వీలుకాదు పొమ్మని పంపించేశారట అంతా చెప్పి 'ఆ డాట్టరుబాబుగోరు కూడ నన్నరతం చేసుకోలే దండమ్మగోరూ వయసొచ్చినోణ్ణి దిక్కులేనోణ్ణి ఇంక మీరే నాకు దిక్కు' అని చేతులు పైకెత్తి జోడించాడు

అతని కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి అతడు ఏడుస్తున్నాడు. అంత పెద్దవాడు పిల్లవాడిలా ఏడుస్తూంటే సౌదామినికి జాలివేసింది అతని మాటలు ఆకారము ఆమె మనసును కరిగించి వేశాయి కాని తను అతనికేమి సహాయం చేయగలదు? అందుకే అడిగింది 'మరి నన్నేమి చేయమంటావు?' అని.

అతడు దీనంగా తనవైపు చూశాడు. ఓ అరనిమిషం తర్వాత మాట పెగల్చుకొని అన్నాడు 'తవరు నన్ను ఆసపత్తిర్లో సేర్పించండమ్మగోరూ' అని

పాపం అతని ముఖం చూస్తూంటే జాలేస్తూంది అంత బాధ కలిగించేది అదేమి జబ్బో మరి. ఛీఫ్‌కే అర్థంకాని ఆ జబ్బు తనకేమి అర్థమవుతుంది? అయినా తను మాత్రం ఏమి చేయగలదు? ఇంత పెద్ద ఆసుపత్రిలో తను ఒక అతి సాధారణమైన మనిషి మొన్న మొన్ననే ఎం బి బి. యస్. పూర్తిచేసి హౌస్‌సర్జన్‌గా చేరింది. ఇతన్ని ఆసుపత్రిలో చేర్పించటానికి తన శక్తి ఎంత? అందులోను ఛీఫ్ కాదన్నాక తనేమి చేయగలదు?

'చూడు నువ్వు వెళ్లి మళ్లీ ఒకసారి ఛీఫ్‌ను చూడు' అంది ఏమి చెయ్యటానికి తోచక అతడు ఆశ్చర్యపోయి 'మల్లా ఆ బాబుగోరి దగ్గిరికా?' అన్నాడు ముఖం అదోలాపెట్టి మళ్లీ అంతలోనే తేరుకొని —

'నాకు మీరే గతండమ్మగోరూ సచ్చి మళ్లీ జలమలో మీ కడుపున పుడతా. నన్ను రచ్చించండి' అని రెండు చేతులూ జోడించి పైకెత్తాడు

ఇక ఏమి చెయ్యటానికి తోచక, అతనితో నిర్మొహమాటంగా కాదని చెప్పలేక, అలా అని అవునని చెప్పే ధైర్యంలేక అంది 'ఈవాళ మాట్లాడతాను రేపొచ్చి కనపడు' అని.

అతన్నైతే పంపించగలిగిందేకాని, సౌదామినికి ఏమి చేయటానికి తోచలేదు. మరి ఏమీ చేయకపోతే రేపు మళ్లీ అతడు వస్తాడు. అందుకని ఏదో ఒకటి చేయటానికే నిశ్చయించుకొంది.

సౌదామిని యిలా నిశ్చయించుకొని యిప్పటి కప్పుడే నాలుగు రోజులయ్యింది. తను శక్తివంచన లేకుండా ప్రయత్నించినా పని జరగలేదు ఈలోగా రెండు రోజులు అతనికేమి జవాబు చెప్పాలో తెలియక దారి మార్చింది అయినా అతడు సాయంత్రం లోపల ఎప్పుడో ఎక్కడో ఒకసారన్నా కనబడుతూనేవున్నాడు. సౌదామిని పెదనాన్నగారు కూడ ఛీఫే. అందుచేత ఆయన ద్వారా కార్యాన్ని సాధించవచ్చుననుకొంది చివరకు. కాని పెదనాన్నగారు ఎప్పుడూ బిజీగా వుండటంవలన మాట్లాడటానికి వీలుపడలేదు.

ఈరోజు ఏది ఏమైనాసరే పెదనాన్నగారిని పట్టి కార్యం సాధించవలసిందే అని గట్టిగా నిర్ణయించుకొంది ఆ నిర్ణయంతోనే సాయంత్రం హాస్టలు నుంచి పెదనాన్నగారింటికి వెళ్లింది

పెదనాన్నగారు పడకకుర్చీలో కూర్చొని ఏదో పత్రిక తిరగవేస్తున్నారు. తనను చూస్తూనే 'రామ్మా౦యీ! కూర్చో.' అన్నారు. తర్వాత పత్రిక సోఫామీద పడవేసి 'ఆఁ చెప్పు ఏమిటి విశేషాలు?' అన్నారు అలా కొంచెంసేపు పిచ్చాపాటి జరిగిన తర్వాత సమయం చూసి తను వచ్చిన పని చెప్పేసింది.

పెదనాన్నగారు వెంటనే నవ్వేశారు 'చూడు, నువ్వింకా చిన్నపిల్లవు నీకు తెలియదు ఇలా రోజుకు ఎందరో వస్తూంటారు.' అన్నారు.

'అదికాదు పెదనాన్నా! అతన్ని చూస్తే అలా అనిపించదు. నిజంగానే ఏదో రోగంతో బాధపడుతున్నట్టున్నాడు కావాలంటేమీరుచూడండి'

'నీకు తెలీదని చెప్పానుకదమ్మా! అంతా దొంగవేషాలు అయినా ఆసుపత్రి యిలా ఎంతమందికని తిండిపెట్టగలదు?'

'కాదు పెదనాన్నా! మరి '

'సరే. నువ్వు చెప్తున్నావుగ! ఏమిచెయ్యను మరి? ఒప్పుకుంటాను. అతన్ని రేపు నాదగ్గరకు పంపించు.'

సౌదామినికి ఒక మహాయుద్ధాన్ని గెలిచినంత, లాటరీలో లక్షరూపాయలు వచ్చినంత సంతోషం కలిగింది ఒక దిక్కులేనివాడికి సహాయం చేయగలుగుతున్నందుకు తన హృదయం తేలికపడింది మనసుకు సంతృప్తికరంగా వుంది

తను విజయాన్ని పొందినందుకు, కార్యాన్ని సాధించినందుకు ఆ రాత్రి తృప్తిగా నిద్రపోయింది సౌదామిని

మరుసటిరోజు అతడు కనబడినప్పుడు 'ఈవాళ ఆసుపత్రిలో చేర్చుకుంటారు.' అని చెప్పి పెదనాన్నగారు వుండే చోటు చెప్పి వెళ్లి కలుసుకోమంది సౌదామిని గర్వంగాను, సంతృప్తిగాను

ఆ మాటలకు అతడు సంతోషంతో ఉబ్బితబ్బిబ్బై, కృతజ్ఞత నిండిన కళ్లతో, ఏదేదో గొణిగి నాలుగైదుసార్లు దండాలుపెట్టి 'మీ మేలు ఎప్పటికి మరిచిపోలేనమ్మగోరూ!' అని వెళ్లిపోయాడు

సౌదామిని కూడ 'పాపం! ఏమి జబ్బో? ఎంత బాధపడుతున్నాడో' అనుకొని తను చేయగలిగింది చేసినందుకు సంతృప్తిగా నిట్టూర్చింది

ఆరోజు సాయంత్రం పెదనాన్నగారే పిలిచి చెప్పారు 'నీ పేషంటును హాస్పిటల్లో జాయిన్ చేయించాను' అని తను కృతజ్ఞతలు తెలిపింది

ఓ వారం గడిచిపోయింది పని తొందరలో అతన్ని ఆసుపత్రిలో చేర్పించినరోజు తర్వాత మళ్లీ ఆవైపు వెళ్లలేదు ఈరోజు సాయంత్రం ఎలాగూ పెదనాన్నగారింటికి వెళ్లాలి. తను అంత కష్టపడి చేర్పించింది కనుక వెళ్లేటప్పుడు అతన్ని చూసి వెళ్దామనుకొంది


సాయంత్రం ముస్తాబై అతడున్న వార్డువైపు నడక సాగించింది సౌదామిని

తను దూరంగా వుండగానే కిటికీలోనుంచి కనిపించింది అతని మంచం గేటు దగ్గరే గోడ ప్రక్కన వుంది అతడు మంచంమీద కూర్చొని వున్నాడు ప్రక్కనే హాస్టల్లో ఊడ్చే అప్పలమ్మ కూర్చొని మాట్లాడుతూందతనితో వాళ్లు తన రాకను గమనించినట్లులేరు

తను గేటు దగ్గరకు చేరిందో లేదో!

'ఎట్నో ఆ సౌదమ్మ దరమాన సేరినావు కడుపుకు కాసింత బువ్వ దొరుకుతూండది ఎట్టాగో ఇంకా ఓ నెల్నాలిక్కడే ఉండేటట్టు సూడు ఈలోపల సిప్పాయోర్లు పని మళ్లీ మొదలెడతారంట. ఏదో ఒక పని దొరక్కపోదు' అప్పలమ్మ గొంతు వినబడుతూంది.

ఆ మాటలు వింటూనే సౌదామినికి తల తిరిగినట్లు, కళ్లు బైర్లుకమ్మినట్లు అయ్యింది పెదనాన్నగారింటికి వెళ్లటం మానుకొని వెంటనే హాస్టలు వైపుకు నడక సాగించింది దారిలో వస్తూంటే తన వెనక ఎవరో పకపకా నవ్వుతున్నట్లు, తనను వెక్కిరిస్తున్నట్లు అనిపించింది




'ఏమేవ్ - ఎంతసేపు నీ స్నానం?! నాకు ఆఫీసుకు టైమవుతోంది! త్వరగా తెముల్చు!'